క్లుప్తంగా

గురుకుల పాఠశాల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నాగులుప్పలపాడు: మండలంలోని అమ్మన బ్రోలు బాలికల గురుకుల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతి తో పాటు 7, 8 తరగతులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మాధవి తెలిపారు. 5వ తరగతికి 80 సీట్లు, 7, 8 తరగతులకు ఖాళీగా ఉన్న సీట్లకు మార్చి 31వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దీనికి గాను ఏప్రిల్ 25వ తేదీ ఎంట్రన్స్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కేరళ లాటరీ నిర్వాహకుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగరాజు

ఒంగోలు టౌన్: నగరంలోని వివిధ ప్రాంతాల్లో కేరళ లాటరీ నిర్వహిస్తున్న పలువురిని పోలీసులు అరెస్టు చేశారు. ఒన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో సీఐ నాగరాజు వివరాలు వెల్లడించారు. నగరంలోని కేశవస్వామి పేట వద్ద కేరళ లాటరీ నిర్వహిస్తున్న ముగ్గురు నిర్వాహకులను పక్కా సమాచారంతో దాడి చేసి పట్టుకున్నట్లు చెప్పారు. వారి వద్ద నుంచి 9,580 రుపాయలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. లాయర్ పేట వద్ద కేరళ లాటరీ రాస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతడి నుంచి 5,100 రుపాయలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగరాజు వివరించారు.

నేడు వెలుగొండలో వస్తు విక్రయ వేలం

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని పలు రకాల వస్తువులు విక్రయించుకునేందుకు బుధవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి తెలిపారు. ఈనెల 13వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నిర్వహించే వెలుగొండస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా పూజా ద్రవ్యాలు, కొబ్బరికాయల విక్రయం, కొబ్బరి చిప్పలు పోగుచేసుకోవడం, అలాగే బ్రహ్మోత్సవాల ముందు రోజు నుంచి వచ్చే ఏడాది బ్రహ్మోత్సవాల ముందు వరకు తలనీలాలు పోగుచేసుకునే హక్కుకు సంబంధించి ఆలయ ప్రాంగణంలో వేలం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆసక్తి ఉన్నవారు ముందుగా రూ.10 వేల ధరావత్తు చెల్లించాలని పేర్కొన్నారు. వేలంలో హక్కులు పొందిన వారు పూర్తి మొత్తాన్ని చెల్లించాలని స్పష్టం చేశారు. వివరాలకు 80999 49996ను సంప్రదించాలని ఈఓ తెలిపారు.

పారిశుధ్య పనుల్లో జాప్యం తగదు

కొనకనమిట్ల: గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టడంలో జాప్యం చేయవద్దని డీఎల్‌పీఓ ఎన్‌వీఎల్.హనుమంతరావు పేర్కొన్నారు. మంగళవారం చినారికట్ల జంక్షన్ వద్ద పారిశుధ్య పనులను ఆయన పర్యవేక్షించారు. గ్రామాల్లో నిర్మించిన చెత్త నుంచి సంపద కేంద్రాలను పూర్తి వినియోగంలోకి తెచ్చి వర్మీ కంపోస్టు తయారు చేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ఆయన వెంట ఈఓఆర్డీ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్‌కు గాయాలు

రాచర్ల: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో మాజీ సర్పంచ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీపంలోని లక్ష్మీదేవి గుడి వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. జేపీ చెరువు గ్రామానికి చెందిన నెమలిగుండ్ల రంగనాయక స్వామి మాజీ చైర్మన్, జేపీ చెరువు మాజీ సర్పంచ్ కన్నసాని ఓబులేసు ఉదయం తన మోటరు సైకిల్‌పై చినగానిపల్లె గ్రామానికి వెళ్తున్నారు. అదే సమయంలో చినగానిపల్లె నుంచి జేపీ చెరువు వైపు మరో బైక్ వస్తోంది. ఈ రెండు బైకులు బలంగా ఢీకొనడంతో మాజీ సర్పంచ్ కన్నసాని ఓబులేసు కింద పడిపోయి తీవ్రంగా గాయపడ్డారు. సమీపంలోని పొలాల్లో పనిచేస్తున్న కూలీలు గమనించి ఓబులేసు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన ప్రైవేట్ వాహనంలో గిద్దలూరులోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.

భవిత కేంద్రంలో తనిఖీ



కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పొదిలి: స్థానిక భవిత కేంద్రాన్ని జిల్లా అధికారులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భవిత కేంద్రంలో నిర్వహిస్తున్న విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో రికార్డులను జిల్లా సమగ్ర సహిత విద్యా సమన్వయకర్త పి.నాగేంద్ర నాయక్, సీఎంఓ సోనీ రూత్ పరిశీలించారు. కేంద్రంలో పిల్లలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. కేంద్రంలో ఫిజియోథెరపీ, ఇతర సేవలను పిల్లలు సక్రమంగా వినియోగించుకునేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. సీడీపీఓ సుధామారుతి, ఎంఈఓలు ఎం.శ్రీనివాసరెడ్డి, నాగలక్ష్మి, సూపర్‌వైజర్ సుభాషిణి, రిసోర్స్ పర్సన్లు తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- వాహనాలు అదుపు తప్పితే అంతే సంగతులు
- కోతకు గురైన బకింగ్ హోమ్ బ్రిడ్జి
- పట్టించుకోని ఆర్అండ్‌బీ అధికారులు



బ్రిడ్జి గోడ పక్కనే ఏర్పడిన గుంతలు



బకింగ్ హోమ్ బ్రిడ్జి పక్కనే ఇలా..

కొత్తపట్నం:

మండల కేంద్రం కొత్తపట్నం నుంచి ఒంగోలు వెళ్లే వాహనాలకు ప్రమాదం పొంచి ఉంది. అల్లూరు–కొత్తపట్నం మధ్యలో బకింగ్ హోమ్ బ్రిడ్జి రెండు పక్కలా వర్షానికి కోతకు గురైంది. బకింగ్ హోమ్ బ్రిడ్జి మార్జిన్ రెండు పక్కలా గుంతలు ఏర్పడ్డాయి. వాహనాలు నడిపేందుకు డ్రైవర్లు భయాందోళన చెందుతున్నారు. మార్జిన్ దిగితే వాహనాలు తిరగబడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మండలంలోని మోటుమాల, పాదర్తి, రంగాయపాలెం, కె.పల్లెపాలెం, గమ్మళ్లపాలెం, కొత్తపట్నం నుంచి నిత్యం పది వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. గుంతలు ఏర్పడటంతో ప్రయాణం ఇబ్బందిగా మారుతోందని డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రుల సమయంలో వాహనాలు వెళ్లేందుకు కష్టసాధ్యమవుతోందని డ్రైవర్లు వాపోతున్నారు. అధికారులు పట్టించుకోక పోవడంతో సమస్య అలాగే పెండింగ్‌లో ఉంది. అదేవిధంగా ఉంటే కాలక్రమంలో బ్రిడ్జి కూడా పగుళ్లు వస్తాయని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షానికి పడిన గోతులు పూడ్చాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. వాహనాలకు ముప్పు ఏర్పడక ముందే మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.



కోతుకు గురైన బ్రిడ్జి మధ్య గోడ

రైతులు విశిష్ట సంఖ్యను నమోదు చేయించుకోవాలి

మద్దిపాడు: రైతులు విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ రామ్మోహన్ రావు అన్నారు. పెద్ద కొత్తపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలని, ఆ విధంగా నమోదు చేయకపోతే ప్రభుత్వం అమలు చేసే పథకాలు పొందటానికి వీలు ఉండదన్నారు. ఏడీఏ వెంకట్రావు మాట్లాడుతూ రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు ముగ్గు చూపాలని, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాన్ని ఆర్జించాలని సూచించారు. కార్యక్రమంలో వారి వెంట వ్యవసాయ అధికారి రమేష్, సహాయకులు ప్రసన్న, రైతులు పాల్గొన్నారు.



పెద్దకొత్తపల్లిలో రైతులతో మాట్లాడుతున్న రమేష్‌బాబు, డీడీఏ రామ్మోహన్‌రావు

ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు తప్పనిసరి

చీమకుర్తి రూరల్: పొలం ఉన్న ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్ శ్రీనివాసరావు అన్నారు. మంచికలపాడు సచివాలయ పరిధిలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొని రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ పై అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి డీవీ భాస్కర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుపరిచే పథకాలు అందాలంటే తప్పనిసరిగా ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సహాయక వ్యవసాయాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



ఒకచోట చేరిన పూర్వ విద్యార్థులు

కొత్తపట్నం: గుంటూరు బాప్టిస్ట్ హాస్టల్లో ఉంటూ 1970వ సంవత్సరంలో డిగ్రీ చదువుకుని ఉద్యోగాలు చేసి పదవీ విరమణ పొందిన పూర్వ విద్యార్థులు మంగళవారం స్థానికంగా సమావేశమయ్యారు. కార్యక్రమానికి రిటైర్డ్ డివిజనల్ కో ఆపరేటీవ్ రిజిస్ట్రార్ గంగవరపు జగ్జీవన్ అధ్యక్షత వహించారు. పూర్వ విద్యార్థులు పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. పిల్లలు ఎంత మంది, వారు ఏం చేస్తున్నారు.. వివరాలు ఒకరికొకరు పంచుకున్నారు. కొందరు పాటలు పాడి స్నేహితులను అలరింపజేశారు. ఈ సందర్భంగా జగ్జీవన్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులకు ఇప్పటికే 70 ఏళ్లు దాటాయన్నారు. ఒక్కసారిగా అందరం కలుసుకుని మాట్లాడుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఇక నుంచి ఏటా ఇలాగే సమావేశం కావాలని తీర్మానించుకున్నారు. సమావేశానికి ఓఎన్‌జీసీ రిటైర్డ్ మేనేజర్ డీఎస్ రాజ్‌కుమార్ హాజరయ్యారు. హైస్కూల్ రిటైర్డ్ ఉపాధ్యాయుడు ప్రభుదాస్, ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ నాయకుడు కె.నాగయ్య, న్యాయవాది పీటీ లూకా, రిటైర్డ్ ఎంఈవో పాలపర్తి విజయ్‌భాస్కర్, రిటైర్డ్ డీఈవో కసుమూరి జాషువా పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

మద్దిపాడు: మండలంలోని మార్రెళ్లగుంటపాలెం గ్రామ పొలాల్లో కోతముక్క ఆడుతున్న ఐదుగురు జూదరులను అరెస్టు చేసినట్లు సంతనూతలపాడు ఎస్ఐ అజయ్ కుమార్ తెలిపారు. వారి వద్దనున్న రూ.47,330 నగదు, 6 సెల్ ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సుమారు పది మంది పారిపోయారన్నారు.

డీపీవో ఆకస్మిక తనిఖీ



చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో వెంకట నాయుడు

నాగులుప్పలపాడు: పంచాయతీ శాఖ జిల్లా అధికారి వెంకట నాయుడు మంగళవారం మండలంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదటిగా మండల కేంద్రం నాగులుప్పలపాడు లోని చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని తనిఖీ చేసిన డీపీవో కేంద్రంలో నిర్వహిస్తున్న వర్మీ కంపోస్టు ఎరువుల పనితీరును పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని సందర్శించి పంచాయితీల కు సంబంధించిన పలు రికార్డులు పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి గ్రామల్లో జరుగుతున్న అభివృద్ధి ప్రణాళికలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మురళీ మోహన్, సిబ్బంది ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

ఒంగోలు సిటీ: ప్రతి మహిళా అన్ని రంగాల్లో ముందడుగు వేయాలని ఒంగోలు ఒన్‌టౌన్ సీఐ నాగరాజు అన్నారు. మంగళవారం సాయంత్రం ఒంగోలు బండ్లమిట్టలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఉమెన్స్ డే నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఐ నాగరాజు హాజరై వ్యాసరచన, పెయింటింగ్ పోటీలను పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలందరూ కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. సభాధ్యక్షురాలు జి.కృష్ణకుమారి మహిళల సమానత్వం గురించి వివరించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను సీఐ నాగరాజు అభినందించారు.



మాట్లాడుతున్న సీఐ నాగరాజు

వైభవంగా లక్ష్మీనారాయణ స్వామి కళ్యాణం

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలో శ్రీదేవి భూదేవి సమేత అమలక లక్ష్మీ నారాయణస్వామి ఆలయంలో 62వ సప్తాహ మహోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ నారాయణస్వామి కళ్యాణాన్ని ఆలయ అర్చకులు మంగళవారం వైభవోపేతంగా నిర్వహించారు. త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో వేదపండితులు కిశోర్, అర్చక బృందం స్వామి వారి కళ్యాణం జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి కళ్యాణాన్ని తిలకించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు డీవీ కృష్ణారెడ్డి, జి.వెంకటరెడ్డి, మహిళా కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.




స్వామివారి కళ్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

ఆదరణ పనిముట్లపై నేడు అవగాహన

చీమకుర్తి: ఆదరణ–3 పథకం ద్వారా బీసీ కార్పొరేషన్ ద్వారా పనిముట్లు అందించే ఏజెన్సీలపై అవగాహన కోసం బుధవారం చీమకుర్తి మున్సిపల్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు కమిషనర్ రామకృష్ణయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పనిముట్ల నాణ్యత, వాటిని సరఫరా చేసే సంస్థల వివరాల కోసం కులవృత్తి దారుల సంఘాలకు చెందిన ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరు కావాలని కమిషనర్ పేర్కొన్నారు.

ఘనంగా రామకృష్ణ పరమహంస జయంతి

ఒంగోలు మెట్రో: నగరంలోని జిల్లా కోర్టు వద్ద నెల్లూరు వారి ఇన్స్పిరేషన్ సెంటర్ రామకృష్ణ మిషన్ హాల్లో రామకృష్ణ పరమహంస జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. రామకృష్ణ పరమహంస అవతార విశిష్టత గురించి విజయవాడ రామకృష్ణ మిషన్ వినిశ్చలానంద మహారాజు స్వామి వివరించారు. మానవులు ముక్తిని పొందడం ఎలా? భగవత్ సాక్షాత్కారం పొందే విధానాన్ని పరమహంస బోధించారని చెప్పారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. సహాయ సహకారాలు అందించిన ఒంగోలు అపోలో హాస్పిటల్ సిబ్బందికి నిర్వాహకులు ఉమా శంకర్, మైనంపాటి సాయికుమార్, దయాకర్, శంకర్‌రెడ్డి, మాల్యాద్రి, శాస్త్రి తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.



మాట్లాడుతున్న వినిశ్చలానంద మహారాజ్ స్వామి

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

సంతనూతలపాడు: మహిళలు వంటింటికే పరిమిత కాకుండా అన్ని రంగాల్లో రాణించాలని సంతనూతలపాడు తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి కోరారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నాలుగో రోజున ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శన కార్యక్రమంలో తహసీల్దార్ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ సంతనూతలపాడు సూపర్‌వైజర్ పీ నాగలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు తయారుచేసిన పోషకాహారాలతో ప్రదర్శన నిర్వహించారు. వీటిని తహసీల్దార్ వి.ఆదిలక్ష్మి, జెడ్పీటీసీ డి.రమణమ్మ, వెలుగు ఏపీఎం టీ బాబురావు, మండల పరిషత్ ఏవో విజయలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ శకుంతల, సీహెచ్ఓ ఆర్.ప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పీ నాగలక్ష్మి, ఆర్ పార్వతి బాయ్ తదితరులు పరిశీలించి, నాణ్యమైన పోషకాహారాలు తయారుచేసిన అంగన్‌వాడీ టీచర్లను అభినందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లకు యోగా క్లాసులు, ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు వివరించారు. సంతనూతలపాడు, వేములపాడు, ఐసీడీఎస్ సెక్టార్ల ఆధ్వర్యంలో ఈ పోషకాహార ప్రదర్శన నిర్వహించారు.



కార్యక్రమానికి హాజరైన తహసీల్దార్ ఆదిలక్ష్మి, జెడ్పీటీసీ రమణమ్మ

పౌష్టికాహారం తిని ఆరోగ్యంగా ఉండాలి



చీమకుర్తిలో చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాల స్టాల్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ బ్రహ్మయ్య , ఎంపీడీవో రాఘవేంద్ర

మద్దిపాడు: మహిళలు, చిన్నారులు పౌష్టికాహారం తింటూ ఆరోగ్యంగా ఉండాలని తహసీల్దార్ సుజన్ కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటు చేసిన పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ వర్కర్లు జొన్నలు, రాగులు, సజ్జలు వంటి చిరుధాన్యాలతో తయారు చేసిన పిండి వంటలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆయన వెంట ఇన్‌చార్జ్ ఎంపీడీవో వరప్రసాద్ ఎంఈఓ ఆంజనేయులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పద్మ, నాగరాజా, పలువురు అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారం సమపాళ్లలో తీసుకోవాలి

చీమకుర్తి రూరల్: మహిళలు, చిన్నారులు పౌష్టికాహారం సమపాళ్లలో తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉంటారని, పౌష్టికాహారం ఆరోగ్యానికి మంచిదని మండల తహసీల్దార్ ఆర్ బ్రహ్మయ్య అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం మహిళా దిన వారోత్సవాల సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బంది చిరుధాన్యాలతో తక్కువ వ్యయంతో తయారు చేసిన ఆహార పదార్థాలు ప్రదర్శించిన స్టాల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కే రాఘవేంద్ర, మునిసిపల్ కమిషనర్ వై రామక్రిష్ణయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు కే ప్రమీల, ఆర్ పిచ్చమ్మ, కే దేవసేన, అంగన్‌వాడీ సిబ్బంది, తల్లులు పాల్గొన్నారు.



మద్దిపాడులో మాట్లాడుతున్న తహసీల్దార్ సుజన్‌కుమార్

మెరిట్ విద్యార్థిని జయలక్ష్మికి వీసీ అభినందనలు

ఒంగోలు సిటీ: ఇటీవల విడుదలైన డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో 9.61 జీపీఏతో ఆంధ్ర కేసరి యూనివర్సిటీ స్థాయిలో మూడో సెమిస్టర్‌లో మొదటి ర్యాంకర్‌గా నిలిచిన కనిగిరిలోని ఏఎల్‌ఎన్ఎంఅండ్ వైష్ణవి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని మితుకుల జయలక్ష్మిని ఆంధ్ర కేసరి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి అభినందించారు. మంగళవారం కళాశాల కరస్పాండెంట్ రామన విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ ఎస్.వెంకటేశ్వర్లు తదితరులతో కలిసి జయలక్ష్మి వీసీ మూర్తిని ఆయన చాంబర్‌లో కలిసి తాను సాధించిన మార్కుల గురించి ప్రిన్సిపాల్ ద్వారా తెలియజేశారు. వెనుకబడిన ప్రాంతం కనిగిరికి చెందిన జయలక్ష్మి సాధించిన అత్యుత్తమ ప్రతిభ గురించి తెలుసుకున్న వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ మూర్తి ప్రత్యేకంగా అభినందనలు తెలిపి జ్ఞాపికను అందజేశారు.



జయలక్ష్మిని అభినందిస్తున్న వీసీ ప్రొఫెసర్ మూర్తి

చర్చిలపై చర్యలు ముమ్మాటికీ వివక్షే

ఒంగోలు టౌన్: కలెక్టర్ అనుమతులు లేకుండా నిర్మించిన చర్చిలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ పంచాయతీరాజ్ కమిషనర్ గత నెల 10వ తేదీన ఇచ్చిన ఆదేశాలు ఎంతమాత్రం సమర్థనీయం కాదని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.శ్రీనివాసరావు అన్నారు. నగరంలోని ఎల్బీజీ భవనంలో మంగళవారం కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు లేని చర్చిలపై సమగ్ర విచారణకు ఆదేశించడం క్రైస్తవ మతంపై వివక్ష చూపడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలకొల్లులోని ఒక చర్చి సమస్యలను అడ్డం పెట్టుకొని రాష్ట్రం మొత్తం విచారణ జరపాలనడం సరైన నిర్ణయం కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఓ.నల్లప్ప, ఆంధ్ర మాల్యాద్రి, ర ఘురాం, చిరంజీవి, నటరాజు లింగమ్మ, క్రాంతికుమార్, కాంతిబాబు పాల్గొన్నారు.



రాష్ట్ర కమిటీ సమావేశంలో మాట్లాడుతన్న కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి